సంక్షేమ సారథులు వలంటీర్లు



నా పేరు హేమావతి. తాడిపత్రిలోని పోరాట కాలనీలో వలంటీర్‌గా పనిచేస్తున్నా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను రాజకీయ పార్టీలకు అతీతంగా అందిస్తున్నా. ప్రజలకు సేవలు చేయడంలో సంతృప్తి ఉంది. పింఛన్ అందించిన తరువాత అవ్వాతాతల ముఖాల్లో కనపడుతున్న సంతోషం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. జగనన్న ఆశయం నెరవేర్చేడానికి కృషి చేస్తాను.



నా పేరు ఆదినారాయణ రెడ్డి, ఊరు నగరూరు. నాకు 70 ఏళ్ల పైబడి ఉన్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ఆదర్శంగా నిలుస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల కంటే ముందుగా మాకు 1 వ తారీఖు ఉదయమే జీతాలు ఇచ్చినట్లు ఇంటి తలుపులు తట్టి వలంటీర్లు పింఛన్ సొమ్మును అందిస్తున్నారు. ఇప్పటి వరకూ ఇలాంటి ముఖ్యమంత్రిని చూడలేదు.

- పింఛన్ల పంపిణీలో ఆదర్శం
- పౌర సేవల్లో ప్రభుత్వానికి సహకారం
- కోవిడ్ సమయంలో అడుగడుగునా తోడు

పెద్దవడుగూరు: సంక్షేమ పథకాలను నిరుపేదల ఇంటి ముంగిటకే అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చారు. 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించి.. ఆయా కుటుంబాలకు అవసరమైన సేవలను అందిస్తున్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో 1588 వలంటీర్లు మంది పనిచేస్తున్నారు. వీరంతా కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నారు. ఒకటో తేదీ తెల్లవారుజామునుంచే లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్నారు. బియ్యం కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు లేని వారి నుంచి అవసరమైన పత్రాలు సేకరించి సచివాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయించి మంజూరు చేయిస్తున్నారు. వ్యాక్సినేషన్, ఆరోగ్య పరీక్షల సమాచారం చేరవేసి ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారు. తాగునీరు, కాలువల్లో పూడిక, వీధిలైట్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసే నవరత్నాల పథకాలు, చేపట్టే కార్యక్రమాల గురించి తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు వివరిస్తున్నారు. తద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అంతేకాదు గతంలో కరోనా, వరదలు వంటి విపత్తుల వేళ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించి ప్రశంసలూ అందుకున్నారు. వలంటీర్ వ్యవస్థ వృథా అన్న వారు కూడా ప్రస్తుతం శభాష్ అంటున్నారు.



కోవిడ్ సమయంలో మందు పిచికారీ చేస్తున్న రాంపురం వలంటీర్ దస్తగిరి



పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్ (ఫైల్)

నియోజకవర్గంలో వివరాలు ఇలా..

మండలం	సచివాలయాలు	వలంటీర్లు	పింఛన్‌దారులు
పెద్దవడుగూరు	15	242	7,636
పెద్దపప్పూరు	2	178	5,942
యాడికి	16	293	8,135
తాడిపత్రి రూరల్	19	310	5220
తాడిపత్రి మున్సిపాలిటీ	30	565	10,500

వలంటీర్ల పాత్ర అభినందనీయం



కరోనా సమయంలో బంధువులు సైతం ఇళ్ల వద్దకు రావాలంటే భయపడేవారు. ఇలాంటి సమయంలో వలంటీర్ ధైర్యం నింపాడు. నిత్యావసర సరుకులు, శానిటైజర్, మాస్కులు ఇంటి వద్దకు వచ్చి అందించారు. వలంటర్ లేకుంటే ఇబ్బందులు పడేవాళ్ళం.

– నారాయణమ్మ, రాంపురం

1వ తేదీ ఉదయాన్నే పింఛన్ అందుతోంది



వలంటీర్లు వచ్చినప్పటి నుంచి 1 వ తారీఖు ఉదయాన్నే పంఛన్ అందుతోంది. గతంలో పింఛన్ కోసం రచ్చబండ వద్ద పడిగాపులు కాచే వాళ్లం. వలంటీర్ల వల్ల వృద్ధులు, దివ్యాంగులకు అవస్థలు తగ్గాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు మరువలేం.

– రంగడు, గూడూరు

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి నృత్య పుష్పాంజలి



కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు

గుంతకల్లుటౌన్: శ్రీవాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సంస్కృతీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన నృత్య పుష్పాంజలి అలరించింది. ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాలకు చెందిన సుమారు 100 మంది కళాకారులు పాల్గొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు, నిర్వాహకుడు నాగేంద్రయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ అలసిన మనస్సులకు సంగీతం, నృత్యం ఆహ్లాదం పంచుతాయన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన కళాకారులను బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రంగయ్య, నారాయణ స్వామి, కోశాధికారి సుధాకర్ గుప్త, నాట్యాచార్యులు, కళాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ కష్టాలకు చెక్



ఆస్పత్రిపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ఆస్పత్రిపాలెంలో విద్యుత్ కష్టాలకు చెక్ పెడుతూ అధికారులు 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కాలనీలో తరచూ విద్యుత్ సమస్యలు నెలకొనడంతో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థి విభాగం రాష్ట్ర అధికారప్రతినిధి గంగులకుంట కేశవరెడ్డి, టీకే ఫయాజ్‌భాషా, రఘునాథ్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ట్రాన్స్‌కో అధికారులు కాలనీలో వున్న 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి.. ఆ స్థానంలో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

రోగులకు భోజన సౌకర్యం



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో రోగులు, వారి సహాయకులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. రోజూ దాదాపు 150 మందికి భోజనం అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గంగులకుంట కేశవరెడ్డి తెలిపారు.

మహిళాభ్యున్నతే సీఎం ధ్యేయం

గుంతకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా అభ్యున్నతే ధ్యేయం పాలన సాగిస్తున్నారని ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఐటీ విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన తరువాత రూ.11.50 లక్షల కోట్ల సంపదను మహిళలకు జగనన్న కానుకగా ఇచ్చారని గుర్తు చేశారు. దాదపు 31 లక్షల మంది మహిళలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని, వాటి విలువ రూ.7.75లక్షల కోట్లు అన్నారు. 31 సంక్షేమ పథకాలతో రూ.2.66 లక్షల కోట్లు నేరుగా మహిళఅల ఖాతాల్లో జమ చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఫ్యాన్ గుర్తుకే ఓటువేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అధికారంలోకి తెచ్చుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, షావలి, సత్యం జగదీష్, శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొండమీదరాయుడి హుండీ లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న అధికారులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని కొండమీదరాయుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవరకొండపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హుండీల్లోని కానుకలను ఆదివారం లెక్కించినట్లు ఈఓ సాకే రమేష్‌బాబు తెలిపారు. దేవదాయ శాఖ ఉత్సవాల ప్రత్యేక అధికారి సుధారాణి సమక్షంలో లెక్కించామన్నారు. హుండీల్లో కానుకల ద్వారా రూ.3,32,115, భక్తుల ద్వారా చందాల రూపంలో రూ.58,316 మొత్తం రూ.3,90,431 వచ్చిందన్నారు. బ్రహ్మోత్సవాలు పూర్తయిన తరువాత శాశ్వత హుండీల్లోని కానుకలను లెక్కిస్తామన్నారు.

ఎమ్మెల్యే వైవీఆర్‌కు సన్మానం



ఎమ్మెల్యే వైవీఆర్‌ను సత్కరిస్తున్న ఫోరం నాయకులు



రూ. 2 లక్షల విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే

గుంతకల్లు: క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్, కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయించినందుకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరం నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం ఎమ్మెల్యే వైవీఆర్ క్యాంపు కార్యాలయంలో ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఫాదర్ ప్రతాప్‌రెడ్డి, ఏపీ సాల్మన్ విజయరాజు నేతృత్వంలో వైవీఆర్‌ను శాలువా, పూలమాలతో సత్కారించారు. వారు మాట్లాడుతూ దొనిముక్కల రోడ్డులో క్రైస్తవుల బరియల్ గ్రౌండ్‌కు ఎకరంపైగా కేటాయించారని, అలాగే 20 సెంట్లను కమ్యూనిటీ హాల్ కేటాయించడం హర్షణీయమన్నారు. సీఎం జగన్‌కు, ఎమ్మెల్యే వైవీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

వాల్మీకి ఆలయ నిర్మాణానికి విరాళం

గుంతకల్లు రూరల్: మండల పరిధిలోని మొలకలపెంట గ్రామంలో వాల్మీకి ఆలయ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి రూ.2 లక్షల విరాళం గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మురహరి నాయుడు, గ్రామస్తులు జగన్మోహన్, శ్రీధర్, ధనుంజయ, చంద్రప్ప, సూర్యనారాయణ, వడుగూరు రంగస్వామి, ఆర్. రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా గ్రూప్-2 పరీక్షలు



తాడిపత్రిలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

తాడిపత్రి అర్బన్/గార్లదిన్నె: ఆదివారం నిర్వహించిన గ్రూప్–2 పరీక్షలు సజావుగా సాగాయి. తాడిపత్రి పట్టణంలోని ప్రకాశం ఉన్నత పాఠశాల, త్రిబుల్ ఎస్ పాఠశాల, సరస్వతీ డిగ్రీ కళాశాల, శ్రీవాణి, టెక్ ఇంజినీరింగ్, సీవీఆర్టీ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు నిర్వహించారు. కేంద్రాల వద్ద డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా ఆరు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1,660 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 363 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. అలాగే గార్లదిన్నె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో హైస్కూల్‌లో 200 మంది విద్యార్థులకు 14 మంది, మోడల్ స్కూల్లో 300 మందికి 24 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



- రైల్వే గేట్ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి
- అన్నదాతల హర్షం

పామిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. వివరాలు.. పట్టణ బైబిల్ మిషన్ చర్చి సమీపాన ఎల్‌సీ నంబర్ 144 రైల్వేగేట్ వద్ద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ ప్యాసేజ్ నిర్మాణం పనులు ప్రారంభించి, పూర్తి కాకుండానే అధికారులు నిలిపివేశారు, దీంతో రైతులు పొలాలకు వెళ్లాలంటే కిలోమీటర్ మేర కొండ ఏరియా ప్రాంతం మీదుగా వెళ్లాల్సి ఉండేది. కొండ ఏరియా ప్రాంతం కావడంతో మహిళా రైతులు అభద్రతాభావంతో బిక్కుబిక్కుమంటుండేవారు. అల్లరి మూకలతో పాటు వన్యప్రాణుల బెడదతో పొలాలకు వెళ్లలేక పోయేవారు. సమస్యను వివరిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రైతులు లేఖ పంపారు. సీఎం జగన్, రైల్వే మినిస్టర్ అస్వనీ వైష్ణవ్ తక్షణం స్పందించారు. అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం పూర్తవడంతో అన్నదాతల రాకపోకలకు సుగమమైంది. దీంతో రైతులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



నాకు రైల్వేగేట్ అవతలవైపు కోళ్ల ఫౌల్ట్రీ ఫారం ఉంది. రైల్వే లైన్ ఎలక్ట్రిల్ లైన్‌కు రూపొందించారు. దీంతో గేట్ శాశ్వతంగా మూతపడింది. దీంతో దాదాపు ఒక టిన్నర కిలోమీటర్ దూరంలోని పీ కొండాపురం రైల్వేగేట్ చుట్టుకుని కోళ్ల ఫారానికి వెళ్లాల్సి వచ్చేది. అలాగే గేట్ అవతలవైపు పొలాలు ఉన్న రైతుల బాధ వర్ణనాతీతం. రైతులు లేఖ రాయగానే మూడు నెలల్లోనే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయించి రాకపోకలు సుగమం చేయించారు. సకాలంలో స్పందించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

–పీఎండీ ఖాన్, కోళ్ల ఫారం నిర్వాహకుడు, పామిడి

ముఖ్యమంత్రి మేలు మరువలేం



ఎల్‌సీ రైల్వేగేట్ 144 అవతల వైపు నాకు ఐదెకరాల పొలం ఉంది. పొలానికి వెళ్లాలంటే గేట్ మీదుగా దగ్గరదారి. నాతో పాటు వంద మంది రైతులకు సంబంధించి 500 ఎకరాలు గేట్ అవతల పొలాలు ఉన్నాయి. రైల్వే అధికారులు ఎలక్ట్రికల్ లైన్ పనులతో ఆధునీకరణ చేపట్టారు. దీంతో గేట్ మూతపడింది. అన్నదాతల కష్టాలను గుర్తించి సకాలంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించి రాకపోకలు సుగమం చేసిన సీఎం జగన్ మేలు తీర్చుకోలేనిది. అన్నదాతలంతా ఆయనకు అండగా ఉంటాం.

– కే రంగస్వామిరెడ్డి, రైతు, పామిడి

వేర్వేరు రోడ్డు ప్రమాదాలు.. పలువురికి గాయాలు







గాయపడిన విజయకుమార్, వెంకటేష్, లక్ష్మీనారాయణరెడ్డి

గుత్తి/గుత్తి రూరల్: పట్టణ శివారులోని తాడిపత్రి రోడ్డులో కుంట కట్ట వద్ద ఆదివారం రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. ప్రమాదంలో శ్రీకాంత్ అనే వ్యక్తి గాయపడ్డాడు. యాడికి మండలం రాయల చెరువుకు చెందిన శ్రీకాంత్ పని మీద బైక్‌లో గుత్తికి వెళుతుండగా ఎదురుగా మరో బైక్ ఢీ కొంది. ప్రమాదంలో గాయపడిన అతడిని స్థానికులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన విజయకుమార్ ఆదివారం వేకువజామున తొండపాడు తిరునాలకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. కొత్తపేట గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి బోల్తా పడి అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా తొండపాడుకు చెందిన వెంకటేష్, వన్నేదొడ్డికి చెందిన సాయి శనివారం అర్ధరాత్రి తొండపాడు తిరునాలకు వెళ్లి, అట్నుంచి జక్కలచెరువులో ఉన్న స్నేహితుడి వద్దకు వెళ్లారు. తిరిగి తొండపాడుకు వస్తుండగా గ్రామ శివారులో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ అనంతపురం తరలించారు. అలాగే మండలంలోని ఇసురాళ్లపల్లికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి ఆటోలో గుత్తి వైపునకు వస్తుండగా తొండపాడు నుంచి వస్తున్న కారు టి.కొత్తపల్లి గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మీనారాయణ రెడ్డి ఆటోలో ఇరుక్కొని తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురం తరలించారు. ఆయా ప్రమాదాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సింగరప్ప స్వామి తిరునాల



అలంకరణలో సింగరప్పస్వామి



ఆలయం వద్ద భక్తుల సందడి

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో క్షేత్రపాల కొండపై వెలసిన సింగరప్పస్వామి తిరునాల ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. ఆలయ సమీపంలో పెన్నా నదిలో ఉత్తర, దక్షిణం నీరు పారడంతో స్నానం చేసి స్వామిని దర్శించుకుంటే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం.ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆశ్వర్థ నారాయణస్వామి సేవలో ఎమ్మెల్యే

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని ఆశ్వర్థనారాయణ స్వామిని ఆదివారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కుటుంబసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించారు.



పెద్దపప్పూరులో ఆశ్వర్థనారాయణస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు, సమన్వయకర్త వీరాంజనేయులు

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా హరీష్‌కుమార్

తాడిపత్రి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గగ సభ్యుడిగా మండలంలోని వీరాపురానికి చెందిన హరీష్‌కుమార్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఆదివారం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హరీష్ తెలిపారు.

మట్కా, పేకాటపై ప్రత్యేక దృష్టి

యల్లనూరు: మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట ఆడుతుంటే సమాచారం ఇవ్వాలని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం సూచించారు. సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడైనా నిర్వహిస్తుంటే సమాచారం ఇవ్వాలని, వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. మద్యం, మట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణా, ఎన్నికల సమయంలో డబ్బులు పంపిణీ వంటివి జరుగుతుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అన్ని గ్రామాలపై పోలీసులు నిఘా పెట్టాలన్నారు.

వైభవంగా బూదిగుమ్మ రథోత్సవం

బొమ్మనహాళ్/బెళుగుప్ప: మండలంలోని ప్రముఖ పుణ్య క్షేత్రం బూదిగుమ్మలో రథోత్సవంలో భాగంగా ఆంజనేయస్వామి తిరునాల ఆదివారం వైభవంగా జరిగింది. చివరిరోజు వేల మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ సమీపంలోని పెన్నానది, జీడిపల్లి రిజర్వాయర్‌లో భక్తులు పూజలు చేసి పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా రంగనాథుడి పార్వేట



అలంకరణలో రంగనాథుడు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం స్వామికి హంసవాహనం, పార్వేట అశ్వ వాహనం వైభవంగా నిర్వహించారు. అర్చకులు పలుకూరి రవికుమార్, చేతన్‌వర్మ, లిఖిల్‌వర్మ, నవీన్‌కుమార్, ఉదయ్‌కుమార్ మంత్రోచ్ఛారణల నడుమ స్వామికి విశేష పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంపై ఉంచి గ్రామంలోని జమ్మి చెట్టు వరకూ ఊరేగించారు. భక్తులకు మాణిక్య రంగనాథ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం, తాగునీటి వసతి కల్పించారు. ఆలయ పరిసరాల్లో భారీ ఎత్తున అంగళ్లు వెలిశాయి. సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ నబిరసూల్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ దేవదాసు, మాణిక్య రంగనాథస్వామి ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్, సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

యల్లనూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దారు జయప్రసాద్ ఆదివారం తెలిపారు. అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. గైర్హాజరైతే కలెక్టరుకు ఫిర్యాదు చేస్తానన్నారు. సమస్యలున్న వారు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పుట్లూరు: మండలంలోని చాలవేముల గ్రామంలో మహాలక్ష్మి అనే మహిళ ఆదివారం విష రసాయం తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె ఆత్మహత్యాయత్నం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమెను చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

29న విగ్రహ ప్రతిష్ట

పుట్లూరు: మండలంలోని రంగమనాయునిపల్లిలో ఈ నెల 29న సీతారామాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 27 నుంచిప్రత్యేక పూజలు నిర్వహించి, 29వ తేదీ స్వామి విగ్రహ ప్రతిష్ఠతో పాటు నవగ్రహ ప్రతిష్ఠ చేపడతామన్నారు. ఉత్సవానికి భక్తులు హాజరు కావాలని వారు కోరారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్



చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న పారిశుధ్య కార్మికుడు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆదివారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు డ్రైనేజీ కాలువలను శుభ్రం చేశారు. అలాగే రోడ్లపై చెత్తాచెదారాన్ని తొలగించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. చెత్తా చెదారాన్ని ట్రాక్టర్‌లో వేసి కంపోస్టుకు తరలించారు. శానిటేషన్ డ్రైవ్‌ను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పర్యవేక్షించారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

యాడికి: తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం మండలంలో పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిట్టూరు గ్రామంలో ఉదయం 8 గంటలకు రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. లక్షుంపల్లెలో 9 గంటలకు గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రం, 10 గంటలకు చందన గ్రామంలో గ్రామ సచివాలయం, ఆర్బీకే, ఆరోగ్య కేంద్రం ప్రారంభిస్తారన్నారు. అనంతరం రాయలచెరువు నుంచి దైవాల మడుగు వరకూ రూ.9.50 కోట్లతో నిర్మించనున్న డబుల్ రోడ్ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేస్తారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు హాజరు కావాలన్నారు.